క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 12న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. హనుమకొండ చౌరస్తా, కాకాజీ కాలనీ, అశోక జంక్షన్, టైలర్ స్ట్రీట్, జేఎన్ స్టేడియం, కాకతీయ డిగ్రీ కళాశాల ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, ఈద్గా, కుమార్‌పల్లి, కొత్తూరు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు కేడీసీలో జాతీయ సదస్సు

విద్యారణ్యపురి: హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని మైక్రో బయాలజీ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 12న ఉదయం జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గుర్రం శ్రీనివాస్, సదస్సు కన్వీనర్ డాక్టర్ అపర్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మైక్రోబియల్ ఫ్రాంటియర్స్ హార్‌నెస్సింగ్ జీనోమిక్స్ సింథటిక్ బయాలజీ అండ్ మైక్రోబయోమ్ ఇన్నోవేషన్స్ అనే అంశంపై నిర్వహించే జాతీయ సదస్సులో కేయూ మైక్రో బయాలజీ రిటైర్డ్ ప్రొఫెసర్ రాంరెడ్డి కీలకోపన్యాసం చేస్తారని పేర్కొన్నారు.

మాలతికి డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ విభాగంలో పరిశోధకురాలు పీఎస్.మాలతికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఫార్మాకోకినెటిక్ అండ్ ఫార్మాకాడీనామిక్ ఇంటరాక్షన్ స్టడీస్ ఆఫ్ సెలెక్టెడ్ డ్రగ్స్ విత్ సమ్ ఫైతో కెమికల్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి మాలతికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ తెలిపారు. ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ నర్సింహారెడ్డి పర్యవేక్షణలో మాలతి తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ పెంపు




కేయూ క్యాంపస్: ఎన్‌సీసీతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఏకాగ్రత, దేశభక్తి, మానసిక ఉల్లాసం, తదితర లక్షణాలు పెంపొందుతాయని కాకతీయ యూనివర్సిటీ మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భిక్షాలు తెలిపారు. కళాశాలలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థినులకు ఎన్‌సీసీ 8వ గర్ల్స్ బెటాలియన్ సీనియర్ జేసీఓ సుబేదార్ కె.రమణారావు పర్యవేక్షణలో ఎన్‌సీసీ కేడెట్ల ఎంపిక ప్రక్రియను గురువారం నిర్వహించారు. 100 మందికి పైగా విద్యార్థినులకు వివిధ పరీక్షలు నిర్వహించగా అందులో 35 మంది ఎంపికైనట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ యూనిట్ కేర్ టేకర్ వై.యశస్విని, కళాశాల అధ్యాపకులు, సూపరింటెండెంట్ వీరు నాయక్ పాల్గొన్నారు.

ఉపకరణాల బహూకరణ


విద్యారణ్యపురి: దేవేందర్‌రెడ్డి స్మారకార్థం అతని భార్య హరిత, కుమారుడు హరికృష్ణ హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రూ.2 లక్షల విలువ చేసే వివిధ ఉపకరణాలను కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శ్రీదేవికి గురువారం అందజేశారు. ప్రొజెక్టర్, ప్రొజెక్టర్ స్క్రీన్, కంప్యూటర్లు 2, లైబ్రరీకి 295 పుస్తకాలు, లైబ్రరీ ర్యాక్స్ 2, సౌండ్‌సిస్టమ్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా దాతలకు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శ్రీదేవి, లైబ్రేరియన్ రాజేశ్వర్‌కుమార్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి రాజ్‌కుమార్, అధ్యాపకులు జ్యోతిర్మయి, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

కేవైసీ లేకుంటే పనులు కల్పించం



హసన్‌పర్తి: ఈనెల 30లోపు ప్రతీ ఉపాధి కూలీ కేవైసీ చేయించుకోవాలని, లేకుంటే అక్టోబర్ 1 నుంచి పనులు కల్పించబోమని మండల పరిషత్ అభివృద్ధి అధికారి రవి తేల్చిచెప్పారు. హసన్‌పర్తి మండలంలోని వివిధ గ్రామాల్లోని ఉపాధి హామీ పథకం కింద పనులు చేపడుతున్న కూలీల కేవైసీ నమోదు ప్రక్రియను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హసన్‌పర్తిని పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థి అదృశ్యం



ఖిలా వరంగల్: మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధి రంగశాయిపేట ప్రాంతానికి చెందిన మట్టపల్లి శ్రీచరణ్.. ఎస్ఆర్ యూనివర్సిటీలో బీటెక్ థర్డ్ ఇయర్ చదువుతున్నాడు. గతనెల 29న కారు తీసుకొని ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించకపోవడంతో విద్యార్థి తల్లి మట్టపల్లి సుజాత మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ బొల్లం రమేష్ వివరించారు.

చెరువులకు జల కళ

- నిండు కుండలా జలాశయాలు, కుంటలు
- పచ్చని పైరుతో పంటపొలాలు కళకళ
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు



వరద నీటితో నిండిన సోమిడి చెరువు



ఆయకట్టు కింద కళకళలాడుతున్న పచ్చని పైరు

కాజీపేట: వరుణిడి కరుణతో మండల పరిధిలో ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిశాయి. చెరువులు, కుంటలు నిండి వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. పట్టణ శివారులోని చెరువులు, కుంటల్లో గతంలో ఎన్నాడూ లేనివిధంగా నీటి నిల్వలు ఉన్నాయి. మొదట్లో కాస్త ఆలస్యం అయిన చివరకు ఆశించిన స్థాయిలో వర్షాలు కురవడంతో చెరువుల కింద ఆయకట్టు పంటపొలాలు పచ్చని పైర్లతో కళకళలాడుతున్నాయి.

చెరువుల అభివృద్ధితో..

ఏడేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం చెరువు కట్టలను పటిష్టం చేయడం, లోతు తవ్వించడం, తూములు, మత్తళ్లకు మరమ్మతులు, తుమ్మలను తొలగించింది. సోమిడి ఊర చెరువుకు రూ.66.67 లక్షలు, టేకులగూడెం మాటు చెరువుకు రూ.68 లక్షలు, మడికొండ పరికికుంటకు రూ.30 లక్షలు, రాంపురం మూడు కుంటలకు రూ.27 లక్షల చొప్పున అధికారులు నిధులు కేటాయించి అభివృద్ధి పనులను చేయించారు. ప్రతిఏటా వర్షాలు భారీగా కురవడంతో వరద నీటితో చెరువులు, కుంటలు నిండాయి. చెరువులు, కుంటల లోతు ఎక్కువగా తీయించిన కారణంగా నీటి నిల్వ సామర్థ్యం గతంలో కన్నా రెండింతలు పెరిగింది. ఈఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు పడుతుండడంతో చెరువులు, కుంటల్లోకి వరద చేరడంతో రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

చెరువులు నిండాయి



ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలతో పట్టణ శివారులోని చెరువులు, కుంటలు నిండి నిండు కుండలా కనిపిస్తున్నాయి. ఎటుచూసినా నీరు తొణికిసలాడుతోంది. నీటి కరువు తీరింది. పంటలు పండుతాయనే నమ్మకం కలిగింది.

\- బోయిని నాగరాజు, రైతు

ఎటుచూసినా పంటపొలాలే..



చెరువులు, కుంటల కింద ఉన్న ఆయకట్టు భూములన్నీ పచ్చదనాన్ని పర్చుకోవడం ఆనందంగా ఉంది. వరిపొలాలు పచ్చగా కళకళలాడుతున్నాయి. ఆశించిన స్థాయిలో వానలు కురుస్తుండడం సంతోషంగా ఉంది.

\- ఎండి.గఫార్, కాజీపేట

పెరిగిన ఆయకట్టు

గత ప్రభుత్వం చేపట్టిన పనులు రైతులకు ఉపయోగపడే పరిస్థితి కన్పిస్తోంది. సోమిడి ఊర చెరువు కింద 108 ఎకరాలు, టేకులగూడెం చెరువు కింద 70 ఎకరాలు, పరికికుంట కట్ట కింద 40 ఎకరాలకు పైగా భూములు సాగవుతుండడంతో అన్నదాతల ముఖాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

గడువులోపు పనులు పూర్తి చేయాలి

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

హన్మకొండ చౌరస్తా: అభివృద్ధి పనులను నిర్ణీత గడువు లోపు పూర్తయ్యేలా చూడాలని అధికారులను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆదేశించారు. హనుమకొండలోని 10, 11వ డివిజన్ల పరిధిలోని కాపువాడలో రూ.60 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ దేవరకొండ విజయ, కాంగ్రెస్ 10, 11వ డివిజన్ల అధ్యక్షులు కుమార్‌యాదవ్, సంగీత్, నాయకులు నసీం జాహ, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నాయినికి సన్మానం

హన్మకొండ అర్బన్: ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తూ పరిష్కరించడంలో కీలక పాత్ర పోషిస్తున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని జిల్లా టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు.. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, గౌరవ అధ్యక్షులు శ్యామన్న, సహ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి రాజేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాము నాయక్, కేంద్ర కార్యవర్గ సభ్యులు లక్ష్మీప్రసాద్, బింగి సురేష్, రాజమౌళి, రాజేష్ ఖన్నా, ప్రణయ్, పృథ్వీ, అశోక్, రాజేశ్వర్‌రెడ్డి, శివ, తదితరులు పాల్గొన్నారు.

విభావరి న్యూస్‌లెటర్ ఆవిష్కరణ

విద్యారణ్యపురి: పింగిళి మహిళా కళాశాల విభావరి న్యూస్ లెటర్‌ను క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రమౌళి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ సురేష్‌బాబు, విభావరి న్యూస్‌లెటర్ కోఆర్డినేటర్ డాక్టర్ జ్యోతిర్మయి, అకడమిక్ కోఆర్డినేటర్ సారంగపాణి, అధ్యాపకులు రాజిరెడ్డి, సమత, రామిరెడ్డి పాల్గొన్నారు.

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం



టీజీపీఎస్సీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

కేయూ క్యాంపస్: నిరుద్యోగుల జీవితాలతో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటమాడుతోందని బీఆర్ఎస్వీ కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర ఆరోపించారు. గ్రూప్ -1 పరీక్షల నిర్వహణలో టీజీపీఎస్సీ విఫలమైందని బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో కేయూ వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం టీజీపీఎస్సీ దిష్టిబొమ్మను దహనం చేశారు. హైకోర్టు తీర్పు మేరకు గ్రూప్ -1 పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కలకోట్ల సుమన్, హనుమకొండ జిల్లా కోఆర్డినేటర్ గంద్రకోట రాకేష్ యాదవ్, నాయకులు గొల్లపల్లి వీరస్వామి, కోరపెల్లి రాజేష్, రాసూరి రాజేష్, బుర్ర మహేష్, తదితరులు పాల్గొన్నారు.

టీజీపీఎస్సీని ప్రక్షాళన చేయాలి

కేయూ క్యాంపస్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కాకతీయ యూనివర్సిటీలోని ప్రిన్సిపాల్ కార్యాలయం నుంచి మొదటి గేట్ వరకు గురువారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మంద శ్రీకాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు కళ్యాణ్, సహాయ కార్యదర్శి బిరెడ్డి జస్వంత్, బాధ్యులు చెన్నూరి సాయికుమార్, పవన్‌కుమార్, మల్లేష్, రాహుల్, రణదీప్, రాజ్‌కుమార్, సందీప్, వినయ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న దీప

కాజీపేట: గ్రేటర్ మున్సిపాలిటీ పరిధిలో మహిళలు ఎదుర్కొంటున్న బహుముఖ సమస్యలపై అధ్యయనం చేసి ఆందోళనలు, పోరాటాలు చేయడానికి కార్యకర్తలు సిద్ధం కావాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.దీప సూచించారు. కాజీపేట మండల కేంద్రంలో మహిళా సంఘం రెండో మహాసభలను గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా 11 మందితో కూడిన ఐద్వా మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా శనిగరపు సంధ్య, జి.అనిత, ఉపాధ్యాక్షురాలిగా రేనుకుంట్ల మయూరి, కార్యదర్శిగా లలిత, గాయిత్రి, సరిత, వనమాల, కె.రజిత, కేతమ్మ, రమాదేవి, జయశ్రీ, రాధిక ఎన్నికయ్యారు. ఐద్వా మండల కమిటీ బాధ్యురాలు బి.ఇందిరా, జిల్లా కమిటీ సభ్యురాలు రమాతార పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న శోభారాణి

వరంగల్ చౌరస్తా: మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో మహిళల హక్కులు, చట్టాలు, బాల్య వివాహాలు, బాలల చట్టాలు, బాలల అక్రమ రవాణాపై అవగాహన కార్యక్రమాన్ని వరంగల్ లక్ష్మీపురంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సఖి సెంటర్ లీగల్ కౌన్సిలర్ శోభారాణి, చైల్డ్‌హెల్ప్ లైన్ కేస్ వర్కర్ మౌనిక మాట్లాడారు. మహిళల, బాలికల రక్షణ భద్రత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సఖి సెంటర్లను నడిపిస్తున్నాయని తెలిపారు. బాధిత మహిళలకు ఉచిత కౌన్సిలింగ్, పోలీస్, న్యాయ, వైద్య సహాయం, తాత్కాలిక వసతి వంటి సేవలను 24 గంటలపాటు అందించనున్నట్లు వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో మహిళలు హెల్ప్ లైన్ 181కు కాల్ చేస్తే తక్షణ రక్షణ కల్పించనున్నట్లు తెలిపారు. చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కేస్ వర్కర్ స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కృషి



బ్రేకర్ల ప్రారంభంలో మధుసూదన్, అధికారులు

హన్మకొండ: వినియోగదారులకు నాణ్యమైన, మెరుగైన విద్యుత్ సరఫరా అందిస్తున్నామని టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం ఆపరేషన్ డైరెక్టర్ టి.మధుసూదన్ అన్నారు. హనుమకొండ కేయూసీ సబ్‌స్టేషన్‌లో రూ.15 లక్షల వ్యయంతో అమర్చిన రెండు 33 సర్క్యూట్ బ్రేకర్లను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు అంతరాయం లేని విద్యుత్ అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నూతన సాంకేతికను అందిపుచ్చుకుంటూ ముందుకు పోతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ ఎస్ఈ పి.మధుసూదన్ రావు, డీఈలు జి.సాంబరెడ్డి, దర్శన్ కుమార్, ఏడీఈలు మల్లికార్జున్, రాజు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

'పోరాట వారసులు' కమ్యూనిస్టులే

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు



హన్మంతరావు స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీనివాసరావు, నాయకులు

మడికొండ: సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులేనని సీపీఐ సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. కాజీపేట మండలం రాంపూర్‌లోని అర్షనపల్లి హన్మంతరావు స్తూపం వద్ద తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవ సభను గురువారం నిర్వహించారు. అనంతరం కాజీపేట మండల కార్యదర్శి మాలోతు శంకర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలంగాణ విలీన దినోత్సవంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కపట నాటకాలు ఆడుతున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యుడు ఆదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, తోట భిక్షపతి, స్టాలిన్, మునిగాల భిక్షపతి, కర్రె లక్ష్మణ్, బత్తిని సదానందం పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్న కేంద్రం



నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు

వరంగల్ చౌరస్తా: బీసీ రిజర్వేషన్లను కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటోందని ఎంసీపీఐ (యూ) వరంగల్ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ విమర్శించారు. బీసీల పట్ల పాలకుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ వరంగల్ అండర్ బ్రిడ్జి నుంచి వరంగల్ చౌరస్తా వరకు గురువారం భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో 56 శాతం బీసీలు ఉంటే కేవలం 42 శాతం బీసీ రిజర్వేషన్లు తీర్మానించడం అన్యాయమని అన్నారు. దేశంలో ఆరు శాతం కూడా లేని ఓసీలకు 10 శాతం రిజర్వేషన్లు ప్రకటించి అగ్రవర్ణ ఆధిపత్యాన్ని మోడీ ప్రభుత్వం ప్రదర్శించిందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు మాలోతు సాగర్, కన్నం వెంకన్న, కుసుంబ బాబురావు, వంగల రాగసుధ, కనకం సంధ్య, సుంచు జగదీశ్వర్, ముక్కెర రామస్వామి, మాలోత్ ప్రత్యూష, మహమ్మద్ ఇస్మాయిల్, గణిపాక ఓదెలు, మెహబూబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

హన్మకొండ: వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం - మద్దికాయల ఓంకార్ పాత్ర అనే అంశంపై శుక్రవారం తొర్రూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి సదస్సును జయప్రదం చేయాలని ఎంసీపీఐ (యూ) హనుమకొండ జిల్లా కార్యదర్శి ఎన్‌రెడ్డి హంసారెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సదస్సు కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు ఎంసీపీఐ (యూ) పార్టీ వ్యవస్థాపకుడు మద్దికాయల ఓంకార్ శత జయంతి సందర్భంగా రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గడ్డం నాగార్జున, మాస్ సావిత్రి, కర్ర రాజిరెడ్డి, చీపురు ఓదయ్య, నాయకులు మొగిలి శ్రీనివాసరావు, సీతారాం రెడ్డి పాల్గొన్నారు.

భోజన పథకాన్ని అక్షయ పాత్రకు అప్పగించొద్దు



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

విద్యారణ్యపురి: జిల్లాలో హనుమకొండ, హసన్‌పర్తి, కాజీపేట మండలాల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయ పాత్రకు ఇవ్వాలనే యోచనను విరమించుకోవాలని సీఐటీయూ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు బొట్ల చక్రపాణి, గ్రామిక జిల్లా కన్వీనర్ నిడికొండ రజిత డిమాండ్ చేశారు. ఈ మేరకు డీఈఓ వాసంతిని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్షయ పాత్రకు అప్పగిస్తే 18 ఏళ్లుగా మధ్యాహ్న భోజన పథకాన్ని నమ్ముకొని పనిచేస్తున్న కార్మికుల కుటుంబాలు రోడ్డున పడుతాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శాంత, సక్కుబాయి, కవిత, సరిత, సంధ్య, ఫర్వీనా, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



కాజీపేట రూరల్: భవన నిర్మాణ కార్మికుల కోసం తెలంగాణ ప్రభుత్వం ఇటీవల రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. ఈ మేరకు హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి చిత్రపటాలకు కాజీపేట బాపూజీనగర్ సెంటర్‌లో భవన నిర్మాణ కార్మికులు గురువారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల గౌరవ అధ్యక్షుడు సిరిల్‌లారెన్స్, యూనియన్ ప్రతినిధులు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా పెంపుతో కార్మిక కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తుందన్నారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు ఇమ్మడి బాబు, పోగుల జాన్సన్, రఫిక్, తేలు సారంగపాణి, బైరి శేషాద్రి, సురేష్, ఇమ్మడి రవి, ఇనుగాల సతీష్, బొల్లె శ్రీనివాస్, సురేష్, లక్ష్మణ్, ఇల్లందుల ఐలేష్, శ్రీనివాస్‌రావు, తిరుపతయ్య, అనిల్ పాల్గొన్నారు.

చందాలు వేసి నిర్మిస్తే.. నేలమట్టం చేశారు

హసన్‌పర్తి: చందాలు వేసి వైకుంఠ ధామం నిర్మిస్తే.. గుర్తు తెలియని వ్యక్తులు దాన్ని నేలమట్టం చేశారని కాలనీవాసులు ఆందోళన వ్యక్తంచేశారు. బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరుతూ వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజును గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఎర్రగట్టు గుట్ట ప్రాంతంలోని 17కాలనీలతో పాటు చింతగట్టు క్యాంపు ప్రజల సౌకర్యార్థం వైకుంఠధామం నిర్మించినట్లు వారు తెలిపారు. వారం రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు నేలమట్టం చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీ కమిటీ అధ్యక్షుడు పావురాల సమ్మయ్య, కాలనీవాసులు పావుశెట్టి శ్రీధర్, పాడి గణపతిరెడ్డి, చకిలం చంద్రశేఖర్, మూల దేవేందర్, మూల తిరుపతి, రఘోత్తంరెడ్డి, సూర్యనారాయణ, ఓదెలు పాల్గొన్నారు.

17న విలీన దినోత్సవాన్ని నిర్వహించాలి

ఖిలా వరంగల్: ఈనెల 17న విలీన దినోత్సవ నిర్వహించాలని సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాషుమియా సూచించారు. వరంగల్ శివనగర్‌లోని తమ్మెర భవనంలో దండు లక్ష్మణ్ అధ్యక్షతన గురువారం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బాషుమియా మాట్లాడుతూ వరంగల్ అబ్బుస్ ఫంక్షన్ హాల్‌లో 15న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. 17న నిర్వహించే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట సభలను జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గన్నారపు రమేష్, భద్రి, ఎలేందర్, రాజు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడిన వారికే టికెట్లు

హసన్‌పర్తి: పార్టీకి సేవలు అందిస్తున్న వారికే టికెట్లు ఇస్తామని మండల ప్రభారి, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బన్న ప్రభాకర్ అన్నారు. బీజేపీ హసన్‌పర్తి మండల పార్టీ ఆధ్వర్యంలో ముఖ్య నాయకులు గురువారం వివిధ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే ఆశావహుల పేర్లను వారు సేకరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు తిరుపతి, కిసాన్‌మోర్చా రాష్ట్ర నాయకుడు పెద్ది మహేందర్‌రెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు చంద్రమౌళి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులపై పాలకవర్గం వివక్ష

కాజీపేట: గ్రేటర్ వరంగల్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికుల పట్ల పాలకవర్గం వివక్ష ప్రదర్శించడం సరికాదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టి.ఉప్పలయ్య విమర్శించారు. కాజీపేట మండల కేంద్రంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్, సీఐటీయూ 2వ మహాసభలను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గోదా సుశీల, కార్యదర్శిగా కొట్టె మల్లయ్య, గౌరవ అధ్యక్షుడిగా కారు ఉపేందర్, కోశాధికారిగా ఉమ్మడి సాగర్, గౌరవ సలహాదారుడిగా కోటి, సతీష్ తదితరులు ఎన్నికయ్యారు. సమావేశంలో బరుపట్ల మహేష్, రెంటాల కోటి, కొట్టె మల్లయ్య, సువర్ణ, మున్నంగి రఘు, కారు ఉపేందర్, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

గుసూల్‌ఖానా నిర్మాణానికి చొరవ చూపాలి

న్యూశాయంపేట: హనుమకొండ ములుగు రోడ్డులోని ఖబ్రస్తాన్‌లో అసంపూర్తిగా ఉన్న గుసూల్ ఖానా నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి చొరవ చూపాలని బీఆర్ఎస్ మైనార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ నయీమొద్దీన్ కోరారు. హనుమకొండ ములుగు రోడ్డులోని ఎంసీసీలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.20 లక్షలతో గుసూల్‌ఖానా నిర్మాణం పనులు ప్రారంభించినట్లు తెలిపారు. స్లాబ్ వరకు నిర్మించి బిల్లులు రాలేదనే నెపంతో కాంట్రాక్టర్ అసంపూర్తిగా వదిలేశాడని ఆరోపించారు. సమావేశంలో తాసిఫ్, కలీం, సలీం, తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఖిలా వరంగల్: బీడీ కార్మికుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఉమ్మడి వరంగల్ జిల్లా బీడి వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎండి.ఖాసీం డిమాండ్ చేశారు. ఈ మేరకు వరంగల్ పెరకవాడలోని అమ్జద్ పాషా అధ్యక్షతన బీడీ కార్మికుల సమావేశం గురువారం జరిగింది. ముఖ్యఅతిథిగా ఖాసీం మాట్లాడుతూ బీడీ కార్మికులకు ఈపీఎఫ్ అందజేయాలని సూచించారు. రిటైర్మెంట్ అయిన కార్మికులకు రూ.7,500 పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీడి కార్మికులు కళావతి, సుజాత, స్వరూప, భాగ్యలక్ష్మి, షబానా, సలీమా, సౌందర్య, స్వప్న, సుజాత, పుష్ప, కల్పన, ఉమ, ప్రమీల పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

విద్యారణ్యపురి: ఇటీవల రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన హిందీ స్కూల్ అసిస్టెంట్ సీహెచ్ రాములును హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హైస్కూల్‌లో గురువారం సన్మానించారు. అలాగే, జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన గౌస్‌పాషా, మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలుగా అవార్డు అందుకున్న చిత్రలేఖను అభినందించారు. కార్యక్రమంలో హిందీ సేవా సమితి పక్షాన ప్రాక్టీసింగ్ హైస్కూల్ హెచ్ఎం జగన్, రాష్ట్రీయ పండిత పరిషత్ జిల్లా అధ్యక్షుడు డీఆర్పీ ఎస్ఎస్అలీ, హిందీ సేవాసమితి అధ్యక్షుడు లక్ష్మణ సుధాకర్, డీఆర్పీ తిరుపతయ్య, హిందీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేవాలయ భూములను పరిరక్షించాలి

హన్మకొండ కల్చరల్: దేవాలయాల భూములను పరిరక్షించాలని వరంగల్ రాష్ట్రీయ హిందూ పరిషత్, దేవాలయాల పరిరక్షణ సమితి నాయకులు కోరారు. ఈ మేరకు రిజిస్టర్ పోస్ట్ ద్వారా ప్రధాన మంత్రికి వినతిపత్రాన్ని గురువారం పోస్ట్ చేసినట్లు రాష్ట్ర అధ్యక్షుడు చీకటి రాజు తెలిపారు.

గాదె దయాకర్‌కు సన్మానం

కేయూ క్యాంపస్: తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ అప్పిలేట్ అథారిటీ సభ్యుడు, కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ గాదె దయాకర్‌ను కేయూ నాన్‌టీచింగ్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం బాధ్యులు హనుమకొండలో గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని వారు కోరారు. కార్యక్రమంలో సంఘ బాధ్యులు డాక్టర్ నాగేశ్వర్‌రావు, కృష్ణమాచార్య, మల్లయ్య, నర్సింహామూర్తి, ప్రభాకర్, చంద్రమౌళి, ప్రకాశం పాల్గొన్నారు.

విద్యార్థి మృతిపై ధర్నా

విద్యారణ్యపురి: నయీంనగర్‌లోని ఓ ప్రైవేట్ హైస్కూల్‌లో విద్యార్థి మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలని ఏబీఎస్ఎఫ్, స్వేరోస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు డీఈఓ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు బొల్ల నరేష్, శనిగరపు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి, ఆదుకోవాలని సూచించారు.

దోమల నివారణకు మందు పిచికారీ

కాజీపేట: 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్‌లో దోమల నివారణ మందులను మున్సిపల్ సిబ్బంది స్ప్రే చేస్తున్నారు. డివిజన్‌లో దోమల వల్ల ప్రజలు జ్వరాల బారినపడి ఇబ్బందులు పడుతున్నారని అధికారులకు కార్పొరేటర్ విజయశ్రీ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శానిటరీ సిబ్బంది స్పందించి డ్రెయినేజీల్లో మందు పిచికారీ చేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

హసన్‌పర్తి: దేవన్నపేట మాజీ సర్పంచ్ చుంచు రవిని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ గురువారం పరామర్శించారు. రవి తండ్రి అనారోగ్య సమస్యలతో మృతి చెందగా, బాధితులకు ధైర్యం చెప్పారు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

ఖిలా వరంగల్: పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడి చేసి రూ.7,330 నగదు, 2సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ తెలిపారు. ఒక్కరు పరారు కాగా, ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

రౌడీషీటర్లు ప్రవర్తన మార్చుకోవాలి

మడికొండ: మడికొండ పోలీసుస్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు తమ ప్రవర్తన మార్చుకోవాలని ఇన్‌స్పెక్టర్ కిషన్ సూచించారు. ఈ మేరకు వారికి పోలీసు స్టేషన్‌లో గురువారం కౌన్సిలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సైలు రాజ్‌కుమార్, రాంమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.